
సాక్షి పల్నాడు

బుధవారం । 8 । మే । 2024



భక్తిశ్రద్ధలతో అమావాస్య హోమం


పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి బండ్లమ్మ ఆలయంలో అమావాస్య సందర్భంగా మంగళవారం హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గుంటి ఆంజనేయస్వామికి పూజలు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ దీక్షా భక్తులు స్వామివారికి 11వేల నిమ్మకాయలతో ప్రత్యేక అలంకారాలు, పూజలు నిర్వహించారు. దీక్షా స్వాములకు నద్ది వితరణ జరిగింది.

న్యూస్‌రీల్

వర్షంలోనూ అంబటి ప్రచారం



నకరికల్లు: ఎన్నటికి తరగని ప్రజాదరణ వైఎస్సార్ సీపీ సొంతమని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చేజర్ల, కుంకలగుంట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్షం కురుస్తున్నా ప్రచారం సాగించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి గుమ్మడికాయతో దిష్టి తీసి ఘనస్వాగతం పలికారు. చిన్నారులు మంత్రి అంబటితో ఫొటోలు దిగుతూ కోలాహలం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో మంత్రి అంబటిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొడ్డపాటి కృష్ణకుమారిభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డపాటి వెంకటరెడ్డి, ఏపీడీసీ డైరెక్టర్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా.. నేడు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: ఈనెల 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయవాడలో రోడ్ షో సందర్భంగా గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లించినట్లు పోలీస్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్లే వాహనాలు బుడంపాడు అండర్ పాస్ నుంచి నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరు, చందోలు చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం మీదుగా హనుమాన్ జంక్షన్ దగ్గర్లోని జాతీయ రహదారి-16 వైపు వెళ్లాలని తెలిపారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు చుట్టుగుంట నుంచి పేరేచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్లాలని సూచించారు.

యార్డుకు 70,843 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 70,843 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా ,776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 55,550 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

మహంకాళీ దేవస్థానానికి రూ.లక్ష విరాళం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాత మంగళవారం రూ.1,01,116లు విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ చేబ్రోలు వాస్తవ్యులు చిన్నంశెట్టి పోతురాజు, పార్వతి దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ విరాళాన్ని అందజేశారని వెల్లడించారు. అనంతరం దాతలు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యయ వివరాలు తెలపండి

గుంటూరు వెస్ట్: రానున్న ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ వ్యయాలకు సంబంధించిన వివరాలను ఎన్నికల పరిశీలకులకు తెలపాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మంగళవారం తెలిపారు. గుంటూరు పార్లమెంట్‌కు మృణాల్ కుమార్ దాస్ (సెల్ 91548 82126) తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రాధానాథ్ పురోహిత్ (91548 82131), ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, ఈస్ట్‌లకు యెర్నె వినోద్ కుమార్ (91548 82129)లు అందుబాటులో ఉంటారన్నారు. వివరాలను సెల్‌ఫోన్ ద్వారాగాని, లేదా ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు వచ్చి నేరుగా అందజేయవచ్చని తెలిపారు.







ప్రచార పర్వం

మరో నాలుగు రోజుల్లో ప్రచార పర్వానికి తెరపడనుంది. జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. ముప్పాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు ప్రచారం నిర్వహించారు. నరసరావుపేట రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రచారం నిర్వహించారు. అనిల్‌కుమార్ స్వయంగా ట్రాక్టర్ నడిపి అందరినీ ఆకర్షించారు. పిడుగురాళ్ల పట్టణంలోని 22వ వార్డులో గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

పేదింటి విద్యకు పెద్దపీట

- విద్యతోనే పేదరిక నిర్మూలన ఆలోచనలో వైఎస్ జగన్
- విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం
- నాడు-నేడుతో దశ తిరిగిన ప్రభుత్వ పాఠశాలలు
- నాడు-నేడు నిధులు రూ.472.6 కోట్లతో జిల్లాలో పాఠశాలల అభివృద్ధి
- అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులకు రూ.977.45 కోట్లు పంపిణీ
- 1,80,089 మంది విద్యార్థులకు ఏటా విద్యాకానుక
- రూ.120 కోట్లతో 40,134 బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల పంపిణీ

ఇదిగో.. మార్పు



75తాళ్లూరులోని జె.బి పాఠశాల(నాడు)



75తాళ్లూరులోని జె.బి పాఠశాల (నేడు)

నరసరావుపేట ఈస్ట్: ఐదేళ్ల కిందట వరకు ప్రభుత్వ పాఠశాలలు కనీస వసతులు లేక కూనారిల్లుతుండేవి. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కన్పించేవి కావు. విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, పాఠం రాసేందుకు బ్లాక్ బోర్డులు సరేసరి. అటువంటి ప్రభుత్వ పాఠశాలలు జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటి రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించారు. అధునాతన ఫర్నిచర్‌తో పాఠశాలలు నూతన శోభను సంతరించుకున్నాయి. ఇంగ్లిష్ మీడియంను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు.

పేదలకు ఎంతో అవసరమైన విద్య, వైద్యం రెండు కన్నులుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి కొనసాగుతున్నది. గతంలో ఏ ప్రభుత్వం కేటాయించని స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. జగనన్న ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నూతన పంథాలో కొనసాగింది. గత పాలకులు ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడులకు పంపాలంటే సంశయించేవారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అటువంటి సర్కార్ బడులకు జగనన్న పాలనలో మహర్దశ పట్టింది. అధ్వానంగా ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాలను అందంగా తీర్చిదిద్దటంతోపాటు అన్ని రకాల వసతులు కల్పించారు. ప్రతి తరగతి గదిలో కార్పొరేట్ స్థాయి బల్లలు, బ్లాక్ బోర్డు, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లను నూతనంగా నిర్మించి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. పరిశుభ్రంగా మరుగుదొడ్లు, శుద్ధి చేసిన తాగునీటి వసతి కల్పించారు. వెలిసిపోయి బీటలు వారిన పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విజ్ఞానం, వినోదం కలసి వచ్చేలా రంగురంగులతో బొమ్మలు వేయించారు. విశాలమైన అదనపు గదులు నిర్మించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.472.6 కోట్లతో మనబడి నాడు-నేడు పనులు జరిగాయి. 1,420 తరగతి గదులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, మరో 474 తరగతి గదులలో స్మార్ట్ టి.వీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ బోధన అందిస్తున్నారు.



డిజిటల్ క్లాస్‌రూమ్

విభాగాలు	పాఠశాలలు	పనులు మొత్తం రూ.కోట్లలో)
ఫేజ్-1	623	149.85
ఫేజ్-2	907	306.95
ఫేజ్-2ఏ	ఫేజ్-1లో బడుల్లో పెండింగ్ పనులకు	11
ఫేజ్-2బి	513 అంగన్‌వాడీ కేంద్రాలు	4.8

సంవత్సరం	లబ్ధిదారులు	జమ అయిన మొత్తం రూ.కోట్లలో)
2019-20	1,61,031	241.55
2020-21	1,72,772	241.88
2021-22	1,92598	250.38
2022-23	1,87,417	243.64
మొత్తం		977.45

బడి తెరిచిన రోజే విద్యాకానుక...

ప్రతి ఏడాది పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగ్ వంటి 10 రకాల విద్యా సంబంధ వస్తువులు అందిస్తున్నారు. జిల్లాలో ఈఏడాది 1,80,089 మంది విద్యార్థులు విద్యాకానుక అందుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడంతో సరిపెట్టకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా ప్రణాళికలతో ముందడుగు వేస్తున్నారు. ప్రాథమిక విద్య 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, 6వ తరగతి నుంచి డిజిటల్ క్లాస్‌రూమ్, 8వ తరగతి నుంచి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందిస్తున్నారు. జిల్లాలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు రూ.120 కోట్లతో ట్యాబ్‌లు అందజేశారు. సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు పాఠ్య ప్రణాళికలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు.

జగనన్న అమ్మఒడి

జగనన్న అమ్మఒడి పథకం ద్వారా తమ పిల్లలను బడికి పంపే ప్రతి తల్లి బ్యాంక్ ఖాతాలో ప్రతి ఏడాది రూ.15వేలు జమ చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో నాలుగేళ్లలో ఇప్పటి వరకు రూ.977.45 కోట్లు తల్లుల ఖాతాలోకి నేరుగా జమ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. వారంలో ఐదు రోజుల పాటు భోజనంతోపాటు కోడిగుడ్డు, మూడురోజులు చిక్కీలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నారు.

ప్రభుత్వబడిలో చదివి జిల్లా ఫస్ట్ వచ్చింది



మా రెండో అమ్మాయి రిషితారెడ్డి ఈ ఏడాది తిలక్ మున్సిపల్ స్కూల్‌లో చదువుతూ పదో తరగతి ఫలితాలలో జిల్లా టాపర్‌గా నిలిచింది. 600లకుగాను 593 మార్కులు సాధించింది. కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షలు ఖర్చుపెట్టినా రానన్ని మార్కులు ప్రభుత్వ బడిలో చదివి రావడం చాలా సంతోషంగా ఉంది. జగనన్న ప్రభుత్వంలో సర్కార్ బడుల రూపురేఖలు మారడంతోపాటు నాణ్యమైన విద్య అందుతోంది అనడానికి మా అమ్మాయి మార్కులే నిదర్శనం. జగనన్న అందించే అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి అన్ని పథకాలు అందాయి.

- గాండ్లపర్తి రంగారెడ్డి, ప్రకాశ్‌నగర్, నరసరావుపేట

మూడోరోజు పోస్టల్ ఓటింగ్ ప్రశాంతం

- ఓటు వేసిన జేసీ శ్యాంప్రసాద్
- సాయంత్రం 4గంటల సమయానికి 2516 మంది ఓటు హక్కు వినియోగం



నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల పోలింగ్ కేంద్రంలో పోస్టల్ ఓటు వేసిన జేసీ శ్యాంప్రసాద్



ఎస్ఎస్ఎన్ కళాశాల ఫెసిలిటేట్ సెంటర్‌లో పోస్టల్ ఓటు వేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట: ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి కేటాయించిన పోస్టల్ బ్యాలెట్‌ను మూడో రోజు పలువురు ఉద్యోగులు ప్రశాంతంగా ఉపయోగించుకున్నారు. మంగళవారం పోలీసు విభాగానికి చెందిన వ్యక్తులకు అవకాశం కల్పించారు. పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేట్ సెంటర్‌లో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదుతోపాటు సాయంత్రం నాలుగు గంటల సమయానికి 645మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ వేశారు. ఇక్కడ నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన ఏడు ఫెసిలిటేట్ సెంటర్ల ద్వారా 2516 మంది ఉద్యోగులు ఓటు వేశారు. ఉదయం 11గంటల సమయానికి 906మంది, ఒంటిగంటకు 1733మంది, మూడుగంటలకు1987మంది ఓటు వేశారు. నియోజకవర్గాల వారీగా సాయంత్రం 4గంటల సమయానికి మాచర్లలో 373మంది, గురజాలలో 360మంది, వినుకొండలో 318, సత్తెనపల్లిలో 350, చిలకలూరిపేటలో 226, పెదకూరపాడులో 244మంది ఓటు వేశారు. నరసరావుపేటలో ఓటింగ్ ప్రక్రియను ఆర్వో పి.సరోజని, అసిస్టెంట్ ఆర్వో సి.రవిచంద్రారెడ్డి పర్యవేక్షించారు. బందోబస్తును ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు పర్యవేక్షించారు.

ఓటు వేసిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును మంగళవారం జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ వినియోగించుకున్నారు. స్థానిక పల్నాడురోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేట్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు.

డబ్బు పంపిణీ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు



నరసరావుపేట: పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు ఓటువేయాలని ప్రచారం చేయడంతోపాటు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులకు ఇద్దరు ఉపాధ్యాయులు డబ్బులు పంపిణీ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పెదకూరపాడులోని పోలింగ్ కేంద్రం వద్ద అమరావతి మండలం మల్లాది గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేసే కంఠమనేని శ్రీనివాసరావు, తాటికొండ మండలం రావెళ్ల ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటిగా పనిచేస్తున్న అదే మండలానికి చెందిన రావెళ్ల శ్రీనివాసరావు డబ్బు పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ఒకరు ఓటరు జాబితాలో పేరు చూస్తుండగా మరొకరు ఓటరుకు రూ.5వేలు చేతిలో పెడుతూ కనిపించారు. ఎన్నికల కమిషన్ విచారణ జరిపి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.3000, గరిష్ఠ ధర రూ.5500, మోడల్ ధర రూ.4200 వరకు పలికింది.

ఈ ముగ్గురు ప్రత్యేకం!

- ఇప్పటి వరకు సత్తెనపల్లి అసెంబ్లీకి 15 దఫాలు ఎన్నికలు
- వరుసగా నాలుగు సార్లు గెలుపొందిన వావిలాల గోపాలకృష్ణయ్య
- రెండుసార్లు యర్రం వెంకటేశ్వరరెడ్డి
- రాష్ట్ర మంత్రి పదవి దక్కించుకున్నది అంబటి రాంబాబు ఒక్కరే



వావిలాల గోపాలకృష్ణయ్య



యర్రం వెంకటేశ్వరరెడ్డి



అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గం రాజకీయంగా చైతన్యవంతమైనది. ప్రజలు ఎప్పుడూ ఒక పార్టీకి పట్టం కట్ట లేదు. వామపక్షాలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపొందారు. సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఒకరికి నాలుగు సార్లు, మరొకరికి రెండేసి పర్యాయాలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యే ఛాన్స్ దక్కింది. మిగిలిన వారికి ఒక్కోసారి అవకాశం ఇచ్చింది. ఇలా ఈ నియోజకవర్గంలో నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వారిలో స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య, రెండు పర్యాయాలు వరుసగా గెలుపొందిన వారిలో యర్రం వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య తొలిసారి 1952, 1955, 1962, 1967లోనూ గెలిచారు. ఇక మిగిలిన అన్ని ఎన్నికల్లో ఎవరైనా ఒక్కసారే గెలుపునకు పరిమితం కాగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మార్క్ అభివృద్ధితో 2004లో గెలుపొందిన యర్రం వెంకటేశ్వరరెడ్డి అత్యధికంగా 24,410 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ నియోజకవర్గంలో ఈ మెజార్టీ ఇప్పటివరకు జరిగిన 15 ఎన్నికల్లో అత్యధికం. తిరిగి ఆయనే 2009లో మళ్లీ గెలుపొందారు. వరుసగా రెండు పర్యాయాలు ఒకే పార్టీ కాంగ్రెస్ నుంచి యర్రం వెంకటేశ్వరరెడ్డి గెలుపొందడం విశేషం. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిని పరిశీలిస్తే ... తొలిసారి 1952లో జరిగిన ఎన్నికల్లో వావిలాల గోపాలకృష్ణయ్య (ఇండిపెండెంట్), 1955లో వావిలాల గోపాలకృష్ణయ్య (సీపీఐ), 1962,1967లలో వావిలాల గోపాలకృష్ణయ్య (ఇండిపెండెంట్), 1972లో గాదె వీరాంజనేయశర్మ (కాంగ్రెస్), 1978లో డాక్టర్ రావెల వెంకట్రావు (కాంగ్రెస్), 1983లో నన్నపనేని రాజకుమారి (టీడీపీ), 1985లో పుతుంబాక వెంకటపతి (సీపీఎం), 1989లో దొడ్డా బాలకోటిరెడ్డి (కాంగ్రెస్), 1994లో పుతుంబాక భారతి (సీపీఎం), 1999లో వైవీ ఆంజనేయులు(టీడీపీ), 2004, 2009లో యర్రం వెంకటేశ్వరరెడ్డి (కాంగ్రెస్), 2014లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు (టీడీపీ), 2019లో అంబటి రాంబాబు (వైఎస్సార్ సీపీ) ఉన్నారు. ఈ లెక్కన చూస్తే పలుమార్లు అంటే ఐదు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, మూడు పర్యాయాలు ఇండిపెండెంట్‌లు, టీడీపీ, రెండు పర్యాయాలు సీపీఎం గెలుపొందగా సీపీఐ, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఒక్కోసారి చొప్పున గెలుపొందారు.

ఒక్కరికే రాష్ట్ర మంత్రి ఛాన్స్

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలువురు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనప్పటికీ రాష్ట్ర మంత్రి పదవి మాత్రం ఒక్క అంబటి రాంబాబుకు మాత్రమే దక్కింది. 2019లో వైఎస్సార్ సీపీ నుంచి 20,876 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి (2022 ఏప్రిల్ 11న) పదవి లభించింది.

క్లుప్తంగా

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిపై దాడి చేసిన టీడీపీ నేతలపై కేసు

నరసరావుపేట టౌన్: రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కిడ్నాప్‌తో పాటు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సిహెచ్.కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మధిర సత్యనారాయణ రెడ్డి స్నేహితుడు (ప్రభుత్వ ఉద్యోగి) పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల వద్ద దిగబెట్టాలని కోరగా వెళ్లాడు. ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వాహనాలపై వచ్చి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకునేందుకు కళాశాల గేటు తోసుకుని బలవంతంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు లోపలికి అనుమతి లేదని వారితో హిందీలో వారించారు. విషయాన్ని గమనించిన సత్యనారాయణ రెడ్డి కలుగచేసుకుని లోపలికి అనుమతి లేదని పోలీసులు చెబుతున్నట్లు వారికి చెప్పాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు నువ్వు ఎవర్రా..మాకు చెప్పేదంటూ సత్యనారాయణరెడ్డి పై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని బలవంతంగా కారులో ఎక్కించుకుని కొట్టుకుంటూ కళాశాల వెనుక ప్రాంతానికి తీసుకెళ్లారు. తాను రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగినని ప్రాధేయపడడంతో విడిచి వెళ్లారు. తనను కిడ్నాప్ చేసి దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు క్రాంతి ట్రాన్స్‌పోర్టు శివ, బీసీ కాలనీ ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ రమేష్, ఇస్లాంపేట బాబులతో పాటు మరికొందరిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ కార్యాలయం ముందు ధర్నా

అమరావతి: మండల కేంద్రమైన అమరావతి టీడీపీ కార్యాలయం ముందు మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఇటీవల వైఎస్ఆర్‌సీపీ నుండి అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు భారతీయ జనతాపార్టీలో చేరారు. మంగళవారం కూటమిలో పార్టీ నాయకుడైన మేకల హనుమంతరావు ఇంటికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వెళ్లి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో అమరావతి గోపాల్‌నగర్‌లోని యాదవ సామాజిక వర్గానికి చెందిన కొందరు ఈ పరిణామాన్ని వ్యతిరేకిస్తూ సుమారు 150 మంది వచ్చి స్థానిక టీడీపీ ఎన్నికల కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. మండల స్థాయి నాయకులు ఎంత సర్ది చెప్పినా వారు వినలేదు. తాము గత ఐదు సంవత్సరాల్లో ఎంతో మానసిక క్షోభ అనుభవించామని, ఆర్థికంగా కూడా నష్టపోయి కేసులు పెట్టించుకున్నామని వారు వాపోయారు. తమపై కేసులు పెట్టి అరెస్టులకు తాళలేక ఊరు వదిలి వెళ్లామని, మా బాధలు ఇలా ఉంటే మీరు వెళ్ళి కలవటాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కార్యకర్తలు బిగ్గరగా కేకలు వేశారు.

మోసం చేయడమే చంద్రబాబు ఎజెండా

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



రుద్రవరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

బొల్లవరం (ముప్పాళ్ళ): ప్రజలను మోసం చేయడమే చంద్రబాబునాయుడు ఎజెండాగా పనిచేస్తాడే తప్ప ప్రజల బాగోగులు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని బొల్లవరం, రుద్రవరం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మంత్రి అంబటి రాంబాబుకు అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు భారీ సంఖ్యలో తోడుగా నిలిచి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధి పొందిన పేద వర్గాలంతా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారని, బాబును నమ్మితే బానిస బ్రతుకులే అన్నారు. చిన్న చిన్న గ్రామాల్లోనూ కోట్ల రూపాయల సంక్షేమాభివృద్ధి నిధులు మంజూరయ్యాయన్నారు. ఐదేళ్ళలో రుద్రవరం గ్రామానికి రూ.12.74కోట్ల నిధులు, బొల్లవరం గ్రామానికి రూ.10.57 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నో రకాల సాహసోపేతమైన సంస్కరణలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. మళ్లీ గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి నియోజకవర్గంలోను నన్ను, పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, బొల్లవరం సర్పంచ్ బద్దిగం పూజితారెడ్డి, గుంటూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి ఏఎమ్‌సీ ఛైర్మన్ పెండెం బాబురావు, ఎమ్‌జేఎమ్ రామలింగారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇందూరి నరసింహారెడ్డి, బద్దిగం వెంకటరెడ్డి, అన్నపురెడ్డి సాయిరెడ్డి, ఈవూరి వెంకటేశ్వరరెడ్డి, ఇసిరెడ్డి శివకోటిరెడ్డి, గున్నం కృష్ణారెడ్డి, అగస్టీన్, కారుమూరి కృష్ణారెడ్డి, రాజశేఖరరెడ్డి, చింతపల్లి రవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్కే

మాచర్ల: నేను క్రైస్తవుల పక్షపాతిని, హిందువులు, ముస్లింలు ఒకటేనని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మానుకొండ కళ్యాణమండపంలో మంగళవారం వందలాది మంది పాస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. క్రైస్తవులు తోటి వారి ప్రేమను కోరుతారన్నారు. చర్చిల అభివృద్ధికి రూ. 3 కోట్లు కేటాయించి కమ్యూనిటీ హాల్స్, ప్రార్థనా మందిరాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎన్డీఏ అధికారంలోకి వస్తే రాజ్యాంగం నాశనం అవుతుందని, నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తారన్నారు. మణిపూర్‌లో లాగా క్రైస్తవులపై దాడులు జరుగుతాయన్నారు. ఇవన్నీ గుర్తుంచుకుని మరోసారి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంని చేసుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తాను అండగా ఉంటానన్నారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మద్దతు పలికి గెలిపించుకుంటామని వారు హామీ ఇచ్చారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: వినుకొండ నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు మండలం అగ్నిగుండాలు, పానుగోటివారిపాలెం, గోపువారిపాలెం, ఊడిజర్ల, ఎర్రబాలెం, ఈపూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బొల్లా మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ 14 ఏళ్ల చంద్రబాబు హయాంలో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని, పదేళ్లు వినుకొండ ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు తాము చేస్తున్న అభివృద్ధిని కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప వినుకొండ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈపూరు మండలంలో మిర్చి నష్టపరిహారం, ప్రభుత్వ భూములు దోచుకున్నారని అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ప్రతి అభివృద్ధి పనిని కోర్టుల్లో కేసులు వేసి జీవీ ఆంజనేయులు అడ్డుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 99.98 శాతం

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు అందరికీ ఓటుహక్కు కల్పించేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో జిల్లా వ్యాప్తంగా మూడురోజుల వ్యవధిలో 99.98శాతం నమోదైంది. విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులు ఓట్లు వేయడంతో పెదకూరపాడు, నరసరావుపేటలో పోలింగ్ శాతం పెరిగింది. జిల్లాలోని ఏడు ఫెసిలిటేటర్ల సెంటర్లలో ఓటుహక్కు వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	7వ తేదీన పోలైన ఓట్లు	మొత్తం పోలైన ఓట్లు	మొత్తం శాతం
పెదకూరపాడు	1929	275	1957	101.45
చిలకలూరిపేట	2207	246	2153	97.55
నరసరావుపేట	2859	716	3140	109.83
సత్తెనపల్లి	2303	389	2232	96.92
వినుకొండ	2373	349	2399	101.10
గురజాల	2338	377	2181	93.28
మాచర్ల	2273	405	2216	97.49
మొత్తం	16,286	2757	16,278	99.98

పిడుగుపాటుకు నలుగురు మృతి



పిడుగుపడి మృతి చెందిన బొందెల నాగేంద్రమ్మ, కుమార్తె యండవల్లి నాగరాణి మృతదేహాలు



ఘటనా స్థలంలో మృతదేహాలు

క్రోసూరు: పిడుగుపడి తల్లీకూతురు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఊటుకూరులోని ఎస్సీ కాలనీకి చెందిన బొందెల నాగేంద్రమ్మ(53), కూతురు నాగరాణి(33)తో కలసి మొక్కజొన్న పనులకు వెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో పిడుగుపడడంతో ఇద్దరు మృతి చెందారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వీఆర్వో మస్తాన్‌వలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు గొర్రెల కాపరులు మృతి

నరసరావుపేట రూరల్/ముప్పాళ్ల: పిడుగుపాటుతో ఇద్దరు గొర్రెల కాపరులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటన నరసరావుపేట మండల పరిధిలోని ములకలూరు గ్రామ సమీపంలో జరిగింది. ముప్పాళ్ల మండలం కుందురువారిపాలేనికి చెందిన ఆవుల కోటేశ్వరరావు(42), మేనల్లుడు జమ్ముల గోపి(35)తో కలసి జీవాలు మేపుకునేందుకు ములకలూరు సమీపంలోని పొలాలకు వెళ్లారు. ఆకాశం మేఘావృతం కావడంతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో చెట్టు కిందకు చేరారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు చెట్టుపై పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

రెండు కుటుంబాల్లోను విషాదం : ఆవుల కోటేశ్వరరావుకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవటంతో జీవాలు కొనుక్కొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజులాగే వెళ్లిన వ్యక్తి శవమై ఇంటికి వచ్చాడయ్యా..మా బాగోగులు ఎవరు పట్టించుకుంటారంటూ భార్య బుజ్జాయి రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన జమ్ముల గోపి నాలుగు నెలల క్రితం కుందురువారిపాలెం గ్రామానికి వచ్చి కోటేశ్వరరావుకు అండగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మావయ్య తో కలసి జీవాలు కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గోపికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పిడుగుపాటుకు గురై ఇరువురు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో, గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరి కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.

బీసీలందరికీ అండగా ఉంటా

వడియరాజులకు హామీ ఇచ్చిన ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్

నరసరావుపేట: నియోజకవర్గ పరిధిలోని వడియరాజులతో పాటు బీసీ వర్గీయులందరికీ తాను అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ దేవళ్ల రేవతి, జిల్లాలోని పలువురు వడియరాజు సంఘ నాయకులు పార్టీ కార్యాలయంలో డాక్టర్ అనిల్‌తో సమావేశమయ్యారు. ఇటీవల కోటప్పకొండ వడియరాజుల సత్రానికి రూ.50లక్షలు ప్రకటించినందుకు వారందరూ డాక్టర్ అనిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ తొలిసారిగా నరసరావుపేట పార్లమెంటు సీటును బీసీ అభ్యర్థినైన తనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని, బీసీలందరూ తనకు సహకరించి ఆ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలని కోరారు. ఒక బీసీ ఎంపీగా నియోజక వర్గంలోని బీసీలందరికీ తలలో నాలుకలా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో వడియరాజుల మున్సిపల్, మార్కెట్‌యార్డు ఛైర్మన్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

సామాజిక న్యాయం పాటించే పార్టీకి పట్టం కట్టండి



నాయిబ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్‌లో కానీ, గురజాల నియోజకవర్గంలో కానీ సామాజిక న్యాయం పాటించే పార్టీకే పట్టం కట్టాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపం నందు నాయిబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నాయిబ్రాహ్మణుల ఏసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామని తెలిపారు. తెలుగు దేశం పార్టీ నర్సరావుపేట పార్లమెంట్ పరిధిలో ఒక్క బీసీకి కూడా ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేదన్నారు. కానీ గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చింది వైఎస్సార్‌సీపీ అన్నారు. నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు తెలుగు దేశం పార్టీ టిక్కెట్ ఇచ్చింది కానీ బీసీ సామాజిక వర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తికి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదన్నారు. ఏసురత్నంకు ఎమ్మెల్సీ టిక్కెట్ కేటాయించింది వైఎస్సార్‌సీపీనేనన్నారు. దేవళ్ల రేవతికి వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయిబ్రాహ్మణులు కూడా చట్ట సభల్లోకి వెళ్లాలని తప్పకుండా తీసుకువెళతానని మాట ఇచ్చారని, జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చాడంటే వెనక్కి తగ్గేదే లేదన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని ప్రతి ఇంటికి మంచినీటిని అందిస్తున్నామన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణం, రైల్వే స్టేషన్ ఆధునీకరణ, రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయిబ్రాహ్మణ నంద యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు ఇంటూరి బాజ్జినంద, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, క్రోదూరి ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ సైదులు, నాయిబ్రాహ్మణుల నాయకులు వంగపాటి వాసు, కేతవరపు వెంకట్రావు, యడవలి శివలింగయ్య, కానుగుంట రమేష్, నెమలికంటి బ్రహ్మం, నెమలికంటి సైదులు, మాచర్ల చెన్నకేశవులు, మొక్కరాల సాంబశివరావు, కేతవరపు ఆంజి, ఫిరంగి సత్యం పాల్గొన్నారు.

ఐదేళ్ల సంక్షేమం చూసి ఓటెయ్యండి

- చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు
- నాదెండ్ల మండలంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- కనపర్రు, మైనంపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో పర్యటన



మైనంపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కావటి మనోహర్ నాయుడు

నాదెండ్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలల్లో జరిగిన సంక్షేమం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు కోరారు. నాదెండ్ల మండలం కనపర్రు పంచాయతీ శివారు గ్రామాలైన మైనంపాడు, మల్లాయపాలెంలో మంగళవారం రాత్రి పర్యటించారు. ఆయా గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు కావటికి ఘన స్వాగతం పలికారు. ముందుగా కనపర్రులోని బాలయేసు పుణ్యక్షేత్రంలో ప్రార్థనలు, ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడిలో పూజలు చేశారు. అనంతరం ఇటింటి ప్రచారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కావటి మనోహర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీ పరిధిలో సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రూ.25 కోట్ల మేర ప్రజలకు ప్రత్యక్ష, పరోక్షంగా లబ్ధి చేకూరిందని వివరించారు. కులం, మతం, వర్గం, పార్టీ ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా చేసుకుని సంక్షేమ పథకాలను అందించే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పచ్చల సీతారామయ్య, జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల, తూబాడు సొసైటీ అధ్యక్షులు కురుగుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, పార్టీ నాయకులు గుంజి శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీబాష, పచ్చవ కోటేశ్వరరావు, మాలే వెంకటస్వామి, నాగేశ్వరరావు, అన్నలదాసు ప్రసాద్, నంబూరి మరియదాసు, పోపూరి జోజియ్య, సాగర్, న్యాయవాది గాలి జయప్రకాష్ తదితరులున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 80 కుటుంబాలు

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అచ్చంపేట ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంకరరావు



వైఎస్సార్ సీపీ గూటికి చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



వైఎస్సార్ సీపీలో చేరిన చింతపల్లి వారితో ఎమ్మెల్యే శంకరరావు



తాళ్లచెరువు గ్రామం నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అనిల్‌కుమార్‌యాదవ్, గోపిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

అచ్చంపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తాళ్లచెరువు గ్రామం నుంచి టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. అచ్చంపేట ఎస్సీ కాలనీకి చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. చింతపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. తాడువాయి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన 20 కుటుంబాల వారు ప్రలోభాలకు లొంగి పొరపాటు చేశామంటూ తిరిగి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి మరీ తిరిగి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేత వైఎస్సార్ సీపీ కండువాలు కప్పించుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 50 యాదవరాజుల కుటుంబాలు

నరసరావుపేట రూరల్: కేసానుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ మాజీసర్పంచ్ లింగాల లక్ష్మీనారాయణతోపాటు 50 యాదవరాజుల కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సిఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలన చూసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు మాజీ సర్పంచ్ లింగాల లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మారూరీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక

ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో పలువురు చేరారు. మాచవరం మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాలు తెలుగు దేశం పార్టీ నాయకులు పనితీరు నచ్చక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి గురజాల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరగా కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందించే సంక్షేమ పథకాలు, నియోజక వర్గంలో మహేష్‌రెడ్డి అందించిన అభివృద్ధి చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో తెలుగు దేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరారు. గురజాల మండలం పల్లెగుంతల గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు తెలుగు దేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు జాస్తి శంకరయ్య, వంకాయల పాటి నాగేశ్వరరావు, దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, ముప్పాళ్ల ఆంజనేయులు, గోళ్ల రామయ్యలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ నువ్వే రావాలి..



నరసరావుపేట రూరల్: దొండపాడులో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జగనన్న నువ్వే మళ్లీ రావాలి అంటూ ప్లకార్డు పట్టి ప్రచారంలో పాల్గొన్నారు. ఫ్యాను గుర్తుకే మీ ఓటు.. అంటూ బొమ్మలతో ఆకట్టుకున్నారు. జగన్ మామయ్య మళ్లీ వస్తేనే అమ్మ ఒడి, విద్యా కానుక వస్తాయని, గోరు ముద్ద అందుతుందని చిన్నారులు చెప్పడం అందరిని ఆలోచింపజేసింది.

కదలిన నారీ లోకం



నరసరావుపేట రూరల్: ఎన్నికల ప్రచారంలో నారీ లోకం కదిలింది. మండలంలో పర్యటించిన వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలికింది. దొండపాడులో అధిక సంఖ్యలో మహిళలు వారికి హారతులు పట్టి, విజయ తిలకం దిద్దారు. కేసానుపల్లిలో గుమ్మడి కాయలతో దిష్టితీశారు.

ఇంగ్లిష్ మీడియం తెచ్చిన ఒకే ఒక్క సీఎం జగన్

సినీ రచయిత కోన వెంకట్



కర్లపాలెం: పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బాపట్ల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కోన రఘుపతి, నందిగం సురేష్‌కు మద్దతుగా మంగళవారం ఆయన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని సమ్మెటవారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి, తమ మద్దతు తెలపాలని కోన వెంకట్ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బెనర్జి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నీ అభిమానం చల్లగుండా..

- ఐస్‌క్రీమ్ బండి నిర్వాహకుడే స్టార్ క్యాంపెయినర్
- జగనన్న మళ్లీ సీఎం కావాలంటూ బైక్‌పై ప్రచారం



యడ్లపాడు: సాధారణ ప్రజలే వైఎస్సార్ సీపీకి ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లుగా మారారు. నవరత్నాలు పథకాలతో తమకు ఎంతో ఇచ్చిన సీఎం జగనన్నకు అందులో కొంతైనా తిరిగివ్వాలని నిర్ణయించుకున్నారు. తమ ఊరి బడి రూపురేఖలు మార్చి, తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఇంగ్లిష్ మీడియం తెచ్చిన.. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఇలా బండి కట్టుకుని ఉప్పరపాలేనికి చెందిన విప్పర్ల జాన్సన్ ఊరూరా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తను ఐసీక్రీమ్ బండి నిర్వహిస్తూ జీవిస్తున్నానని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక తన బిడ్డల చదువులకు భరోసా లభించిందని చెప్పుకొచ్చాడు. ఇంకా కొన్ని జాన్సన్ మాటల్లోనే...' మా గ్రామంలోని పాఠశాలకు ఐదేళ్ల కిందట ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాల రూపురేఖలు మారాయి. ప్రతి సబ్జెక్టు ఒక టీచర్ ఉన్నారు. మా పిల్లలే కాదు ఊరిలోని పేదలందరి పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదివే గొప్ప అవకాశం కలిగింది. ఇవన్నీ నాకు స్ఫూర్తిని రగిల్చాయి. నేను ఎందుకు వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్ కాకూడదని భావించాను. అందుకే నా సొంత వాహనానికి ప్రచార సెట్టింగ్ ఏర్పాటు చేసుకున్నాను. సమావేశాలు, సభలకు, నామినేషన్ల సమయంలో విస్తృతంగా పాల్గొన్నా.. సీఎం జగన్ పథకాలు, వివిధ సభల్లోని ఆయన ప్రసంగాలను ఊరూరా వినిపిస్తున్నాను. చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నాను.'



వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీ వ్యూ..

పేదల కల..సాకారం ఇలా

సగటు జీవుడి సంపాదనలో ముప్పావంతు ఇంటి అద్దె, పిల్లల విద్య, వైద్యానికే సరిపోతుంది. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సొంత ఇల్లు అనేది ఒక కల. ఆ కలను సాకారం చేసింది.. సీఎం జగన్. ఆయన అధికారంలోకి వచ్చాక పేదల జీవన ప్రమాణాల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. నిలువ నీడలేని పేదవారికి సొంతిల్లు అనేది ఎంత ముఖ్యమో గుర్తించారు. ఇందుకు జగనన్న కాలనీలతో ఒక గృహ యజ్ఞమే చేశారు. స్థలమివ్వడమే కాకుండా..ఇంటి నిర్మాణానికి నగదు ఇచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఇసుక, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని రాయితీపై అందించింది. ఇంటి స్థల రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయించింది. కాలనీలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, రోడ్లు ఇలా అన్ని మౌలిక వసతులు కల్పించింది. దాదాపు ఒక్కో కుటుంబాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు స్థిరాస్తిపరులను చేసింది. ఇప్పుడు ఆ జగనన్న కాలనీ వనాలు వికసించి నూతన ఊళ్లుగా వెలుగొందుతున్నాయి.

నరసరావుపేట: పల్నాడు జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.. ఈ కాలనీలను దూరం నుంచి చూస్తుంటే ఒక ఊరు నిర్మాణం జరుగుతున్నట్లుగా కన్పిస్తున్నాయి. నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీ- అందరికీ గృహాలు పథకంపై పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 42,012మందికి స్థలాలు కేటాయించారు. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలంలో ప్రతి ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు అందజేశారు. ఇసుక ఉచితంగా ఇవ్వటంతో పాటు ఇంటికి కావాల్సిన సిమెంటు, నిర్మాణ సామగ్రిని రాయితీపై అందజేశారు.

డీ'సెంటు' హౌస్

పల్నాడు జిల్లా ఏర్పడక ముందు కేవలం 5,200 గృహాల నిర్మాణమే సాగింది. 2022 ఏప్రిల్ 4న జిల్లా ఏర్పడిన తర్వాత నియోజకవర్గాల ఎమ్మెల్యేల సహకారంతో ఆ సంఖ్య పెరిగింది.

- చిలకలూరిపేటలో 4,377మందికి పట్టాలు ఇవ్వగా 4,361 మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 648 గృహాలు పూర్తయ్యాయి.
- నరసరావుపేట పట్టణంలో 5,892 మందికి స్థలాలు ఇవ్వగా 5,886 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 862 గృహాలు పూర్తయ్యాయి.
- వినుకొండలో 6,423మందికి గాను 6,181మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా.. 733 గృహాలు పూర్తయ్యాయి.
- గురజాలలో 5,218మందికి స్థలాలు ఇవ్వగా 5,187మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 747ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.
- మాచర్లలో 4,478 మందిలో 4405 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా 178 ఇళ్లు పూర్తయ్యాయి.
- సత్తెనపల్లిలో 5,017 మందికి స్థలాలిస్తే.. 4,984మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించి..1,313 మంది పూర్తి చేసుకున్నారు.
- పెదకూరపాడులో 10,607 మందికి స్థలాలివ్వగా 10,379 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టి 1,857 గృహాల నిర్మాణం పూర్తయ్యింది.
- నరసరావుపేట పురపాలక పరిధిలోని వారికి వినుకొండ రోడ్డులోని ఉప్పలపాడు-లింగంగుంట్ల మధ్యన గుంటూరు-కర్నూలు రహదారికి 200 మీటర్ల దూరంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో 100 ఎకరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేశారు.
- అలాగే చిలకలూరిపేటరోడ్డులోని టిడ్కో గృహాలకు ఎదురుగా ఖాళీగా ఉన్న 45 ఎకరాల్లో స్థలాలు అందజేయగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు.
- పిడుగురాళ్ల ఆదర్శ నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో 1,320మందికి స్థలాలు ఇవ్వగా 1,120 గృహాల నిర్మాణం వడివడిగా సాగుతోంది.



వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీలో సెంటు స్థలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇల్లు

- జగనన్న కాలనీల్లో కళకళలాడుతున్న డీసెంట్ హౌస్‌లు
- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు
- 19,631కు పెరిగిన గృహ నిర్మాణాల సంఖ్య
- సొంతింటితో పేదలను స్థిరాస్తిపరులను చేసిన సీఎం జగన్
- నిలువ నీడ కల్పించారంటూ లబ్ధిదారుల హర్షం



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సొంతిల్లు అస్సలు ఊహించ లేదు



పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నెలకు రూ.3 వేలు అద్దె చెల్లించుకుంటూ రేకుల షెడ్డులో ఉండే మా కుటుంబానికి సీఎం జగన్ దేవుడిలా సెంటు స్థలం, డబ్బులు ఇస్తే ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్నాం. పది నెలల నుంచి నివాసం ఉంటున్నాం. సొంత ఇల్లు ఏర్పడుతుందని కలలో కూడా ఊహించలేదు.

– కేతావత్ పార్వతీ,
జగనన్న కాలనీ, వినుకొండ రోడ్డు

పది నెలల నుంచి నివాసం



చిరు సంపాదనతో బీసీ కాలనీలో అద్దె ఇంటిలో ఉంటున్న మాకు సీఎం జగన్ సెంటు స్థలమిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో పాటు మేము కొంత వేసుకొని ఇంటి నిర్మాణం పూర్తిచేకున్నాం. పది నెలల నుంచి హాయిగా ఉంటున్నాం. ఇప్పుడు నెలకు రూ.2,500లు అద్దె చెల్లించే పని తప్పింది.

– షేక్ కరీమూన్,
జగనన్న కాలనీ, వినకొండరోడ్డు

అత్యాధునిక నిర్మాణ సామగ్రి

గృహ లబ్ధిదారులకు ఇచ్చే డబ్బుల్లోనే ఇంటికి కావాల్సిన సామగ్రిని ప్రభుత్వమే రాయితీపై అందజేసింది. పౌడర్ కోటెడ్ గాల్వనైజ్ డోర్ ఫ్రేమ్ రూ.2,982కు, విద్యుత్ విభాగానికి చెందిన 19 వస్తువులతో కూడిన కిట్ రూ.5,730లకు, నీటి సరఫరా, డ్రైనేజీకు ఉపయోగించే 10 వస్తువులతో కూడిన సెట్‌ను రూ.4,410లకు, రూ.975 విలువైన టాయిలెట్ సెట్‌ను అందజేసింది.



వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీలో ఇంటిని అందంగా తీర్చిదిద్దిన లబ్ధిదారు

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన



జేఎన్‌టీయూలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎస్ ఇంజినీరింగ్ కళాశాలలోని పోలింగ్ కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం సందర్శించారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి, అక్కడ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద వాహనాల పార్కింగ్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వినాయకం, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజనాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న వృద్ధులు



చీరాల టౌన్: ఇంటి నుంచే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు రెండు రోజులు హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. చీరాల రూరల్, మున్సిపాలిటీ, వేటపాలెం మండలంలో మొత్తం 225 మందికి హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మొదటిరోజు మంగళవారం 103 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్వో వెల్లడించారు. చీరాల మండలంలోని గవినివారిపాలెంలో జరుగుతున్న హోం ఓటింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అలానే మున్సిపాలిటీలో జరుగుతున్న ఓటింగ్‌ను మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఏఈఆర్వో పి.చక్రవర్తి పరిశీలించారు. బుధవారం హోం ఓటింగ్ జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు విధిగా వారి నివాస గృహాల్లో అందుబాటులో ఉండాలని కోరారు. నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేశామని ఆర్వో తెలిపారు.

ప్రచార చిత్రం



గుంటూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్‌బాబుతో కరచాలనం చేస్తున్న మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజని, పక్కన ఎమ్మెల్యే గిరిధర్



గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో సోడా కలుపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా

ఆ..1,219 మంది ఉద్యోగులు మళ్లీ ఓటేయండి

- 5న పోస్టల్ బ్యాలెట్‌కు బదులు, ఈవీఎం బ్యాలెట్‌లు పంపిణీ
- సిబ్బంది పొరపాటు నేపథ్యంలో అవి చెల్లని ఓట్లుగా వెల్లడి
- నరసరావుపేట లోక్ సభకు రేపు, ఎల్లుండి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్
- చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని వారికి మాత్రమే
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

చిలకలూరిపేట: నరసరావుపేట పార్లమెంటు స్థానానికి సంబంధించి చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ బుధ, గురు వారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. చిలకలూరిపేట తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 5న గణపవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టల్ పోలింగ్ ప్రక్రియ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సంబంధించి నిర్వహించినట్లు చెప్పారు. అయితే సిబ్బంది తప్పిదం కారణంగా నరసరావుపేట లోక్ సభ స్థానానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్లకు బదులు, ఈవీఎం బ్యాలెట్లు ఓటర్లకు అందజేయడం జరిగిందన్నారు. ఈ పొరపాటు నేపథ్యంలో 1,219 లోక్ సభ స్థానానికి వేసిన ఓట్లు చెల్లవని వెల్లడించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ స్థానం వదిలివేసి కేవలం పార్లమెంటు స్థానానికి సంబంధించి ఈ నెల 8, 9 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరిగి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కలిగి కేవలం ఐదో తేదీన ఓటు వేసిన ప్రతి ఒక్కరూ తిరిగి నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని, వారి ఓటు హక్కు ఉపయోగించుకోవాలని కోరారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి అతి తక్కువ సమయంలో ఓటు హక్కు ఉపయోగించుకొని నిమిషాల వ్యవధిలో వెళ్లిపోయే ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పొరపాటు ఘటనకు బాధ్యుడైన ఏఆర్వో వరకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే కోన రఘుపతి


బాపట్ల: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోన రఘుపతి పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమ భవన నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ట్రై సైకిళ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేయటం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య, మల్లెల మౌనిక, గుంజి ఏడుకొండలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

అధికారంలో ఉంటే అలా.. లేకుంటే ఇలా

- 2015 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నేతల బరితెగింపు
- ఎమ్మెల్సీగా ఏఎస్ రామకృష్ణ గెలుపు కోసం అధికార దుర్వినియోగం
- టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థినే గెలిపించాలని ఉపాధ్యాయులకు బెదిరింపులు
- టీడీపీ అభ్యర్థి గెలుపు కోసమే పని చేసిన అప్పటి మంత్రులు ప్రత్తిపాటి, నారాయణ
- పొరపాటున మళ్లీ బాబు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు
- ప్రస్తుత బ్యాలెట్ ఓటింగ్‌లోనూ టీడీపీ నాయకుల ప్రలోభాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అధికారం కోసం విచ్చలవిడిగా హామీలు ఇచ్చే చంద్రబాబు... అధికారంలో ఉంటే హిట్లర్ మించిన నియంతను తలపింపజేస్తాడు. సార్వత్రిక ఎన్నికల్లో ఏం చేసినా గెలవాలనే తాపత్రయంలో ఉన్న చంద్రబాబు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పిస్తున్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఉపాధ్యాయులను బెదిరించిన ఘటనలను ఉపాధ్యాయ లోకం ఎప్పటికీ మరువదు. 2015 మార్చి 22న జరిగిన గుంటూరు, కృష్ణా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలే ఇందుకు నిదర్శనం. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును ఓడించేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు సాక్షాత్తూ సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు చేసిన అధికార దుర్వినియోగం అంతా ఇంతా కాదు. పార్టీ మద్దతు ఇచ్చిన ఏఎస్ రామకృష్ణను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించుకునే క్రమంలో టీడీపీ నేతలు ఎంతగా బరితెగించారంటే, ఉపాధ్యాయ వర్గాల్లో బలమైన నేతగా ఉన్న లక్ష్మణరావు వెంట మద్దతుగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను మంత్రులు స్వయంగా తమ కార్యాలయాలకు పిలిపించుకుని బెదిరింపులకు దిగారు. లక్ష్మణరావుకు మద్దతుగా ఉన్న యూటీఎఫ్ సహా అనేక ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులను పిలిపించుకుని టీడీపీ మద్దతు ఇచ్చిన ఏఎస్ రామకృష్ణను ఎమ్మెల్సీగా గెలిపించాలని చంద్రబాబు స్పష్టంగా చెప్పారని, ప్రభుత్వం నుంచి జీతాలు పొందుతున్న మీరందరు(టీచర్లు) తాము చెప్పిన అభ్యర్థికే ఓటు వేయాలని బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సందర్భాలను ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎప్పటికీ మరచిపోలేరు. మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ, శిద్దా రాఘవరావు తాము చెప్పినట్లు నడుచుకోకుంటే గ్రాంటు, జీతాలు నిలిపివేస్తామని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలను, టీచర్లను బెదిరించారు. రెండు జిల్లాల్లోనూ టీడీపీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు సాగించిన దందా, అధికార దుర్వినియోగం అంతా ఇంతా కాదు. టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని అధికారుల పైనా తీవ్ర ఒత్తిడి తేవడంతో పాటు సీఎం హోదాలో చంద్రబాబు నేరుగా సంఘాల నాయకులతో ఫోన్‌లో మాట్లాడి హుకుం జారీ చేశారు. చంద్రబాబు పాలనలోని చీకటి రోజులను గుర్తు చేసుకుంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు పొరపాటున మళ్లీ బాబు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుత బ్యాలెట్ ఓటింగ్‌లోనూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు టీడీపీ నాయకులు తీవ్ర ప్రలోభాలు గురి చేస్తుండటంపై టీడీపీ దౌర్జన్యకాండ అప్పుడే మొదలైందని ఆందోళన చెందుతున్నారు. హుందాగా జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికలను టీడీపీ అధికార, ధనబలంతో కలుషితం చేసిందని అప్పట్లో ఓటమి పాలైన కేఎస్ లక్ష్మణరావు బహిరంగంగా ఆరోపించారు. నైతిక విలువలను పాతరేసి డబ్బు విరజిమ్మి ఓట్లు కొనుగోలు చేశారని టీడీపీపై మండి పడ్డారు.

నూతన పద్ధతిలో నగదు పంపిణీకి ప్రయత్నం

- ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఓటరు స్లిప్పులు, జాబితా
- ఓటరు స్లిప్పులపై బార్‌కోడ్‌తో ఉన్న హోలోగ్రామ్..
- సమాచారం మేరకు అడ్డుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- తనిఖీ చేసి, ఆర్వో కార్యాలయానికి తరలించిన పోలీసులు



రెంటచింతలలో నిలిపిన యామిని ట్రావెల్ బస్సు

రెంటచింతల: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పద్ధతిలో ఓటర్లకు టీడీపీ నగదు పంపిణీ చేయడానికి ప్రయత్నించగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు ముందస్తు.. విశ్వసనీయ సమాచారం మేరకు వెంటనే పోలీసులకు విషయం తెలిపారు. గుంటూరు నంచి మాచర్లకు వస్తున్న యామిని ట్రావెల్ బస్సులో టీడీపీకి చెందిన నగదు పెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు తెలియడంతో.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు నేతృత్వంలో రెంటచింతల ఎస్‌ఐ కె. వెంకట నారాయణరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ పగిడి అనీల్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి మాచర్లకు వస్తున్న ఈ ట్రావెల్ బస్సును గురజాల శివారులోని గొట్టిముక్కల మేజర్ కాల్వ సమీపంలో నిలిపి సోదాలు చేపట్టారు. విషయం బయటకు రావడంతో.. వైఎస్సార్ సీపీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. బస్సులోని లగేజ్ స్టోర్‌లో సుమారు 15 అట్ట పెట్టెలు, 10 తెల్లగోతాల్లో ఓటర్ స్లిప్‌లు, ఓటర్ జాబితాలు ఉండటం పోలీసులు గమనించారు. అనుమానం వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు బస్సులో నగదు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేయడంతో వెంటను ఆ బస్సును మాచర్ల పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ శ్యామ్‌ప్రసాద్‌కు అప్పగించారు. ఓటర్ల స్లిప్‌లపై బార్‌కోడ్‌తో ఉన్న హోలో గ్రామ్ ఉండటంతో ఇది కొత్త పద్ధతిలో ఓటర్లకు నగదు పంపిణీ చేయడానికి ఉపయోగపడుతుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ఓటర్లకు నేరుగా ఈ స్లిప్‌లు అందచేసి తరువాత ఈ స్లిప్‌లు ఆదారంగా నగదును పంపిణీ చేయవచ్చని దీంతో ఎవరికీ అనుమానం వచ్చే అవకాశం ఉండదని భావించినట్లు తెలుస్తోంది. మాచర్ల నియోజకవర్గం గ్రామాల్లోని స్థానిక నాయకుల వల్ల ఓటర్లకు చేరాల్సిన నగదు పక్కదారి పట్టకుండా నూతన పద్ధతిలో ఈ విధానం అమలుచేయడానికి టీడీపీ వారు ప్రత్నించినట్లు చర్చించుకుంటున్నారు. పల్నాడు ప్రాంతంలో ఈ విషయంపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో బస్సులో రూ. 20 కోట్లు నగదు దొరికినట్లు పుకార్లు షికార్లు చేయించారు.